# "భిన్నత్వంలో ఏకత్వము

ఒక్కసారిగా నా జీవితంలో ఎంత మార్పు. ఈ మార్పు నేను కోరుకున్నది కాదు. ఊహించినది కాదు.

నా ప్రమేయం లేకుండానే, నా జీవితంలోని భవిష్యత్తు వర్తమానం చిందర వందరగా అయింది. చెదిరిన జీవితాన్ని దగ్గర చేర్చడానికి నా ధైర్యం సరిపోవడం లేదు.

ఓ మెరుపు మెరిసి, ఒక అల విరిగి, నా భర్త శంకర్‌ని నేరుగా సమాధి వైపు లాక్కెళ్ళింది.

సరిగ్గా నెల రోజుల క్రితం - నడిరోడ్లో, ఓ కారు క్రింద రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్నాడు. ఆ పక్కనే అకారం కోల్పోయి, పొగలు చిమ్ముతున్న మోటారు సైకిల్.

యధేచ్ఛగా, విశృంకలంగా నడిపిన ఓ కారు నిర్లక్ష్యానికి సమిధ అయిపోయాడు. శంకర్.

అభాగ్యుడి ప్రాణం దూది పింజ కన్నా తేలిక. కన్నీటి ఖరీదు కారు చవక.

నలుమూలలా చెదిరిన రక్తపు చుక్కల్లో రాక్షసత్యపు వాసనలు. నలిగిపోయిన మానవత్వం.

ఏం జరిగింది ఎలా జరిగింది. ఏంవిటి ఘోరం ఎవరిది నేరం అన్ని ప్రశ్నలు వచ్చినా, బలహీనుడిని మింగిన బలవంతులదే న్యాయం అయింది. ఆ ప్రశ్నలు శంకర్ సమాధిలోకి వెళ్ళిపోయాడు.

మా మతాంతర వివాహం అటుపక్క వాళ్ళని యిటు పక్క వాళ్ళనీ దూరం చేసింది.

కానీ, నేనంటున్న అపార్టుమెంట్లలోని అందరూ నాకు అండగా

నిలిచారు. ఓదార్పుకి వాళ్ళ భుజాల్ని ఇచ్చారు. నాకూ నా పిల్లలకి సహాయము చేయి అందించారు. మా కన్నీటిని తుడిచారు.

మొద్దు బారిన హృదయంలో, అయోమయం బావిలో దిక్కు తోచని స్థితిలో ఉన్న నేను, రోజులు గడుస్తున్న కొద్దీ వాస్తవాన్ని అంగీకరించే స్థితికి చేరుకున్నాను.

జీవితం మీద కొత్త ప్రశ్నలు, జవాబు దొరకని ప్రశ్నలు నా ముందు కొచ్చి సవాళ్ళు చేయడం మొదలెట్టాయి.

నేను ఒక్కదాన్నే ఎన్నో బాధ్యతలు మోయాలి. ఎన్నో నిర్ణయాలు తీసుకోవాలి.

జీవితాన్ని ఎన్నో కోణాల్లోంచి చూడాలి. నిర్వేదం, కోపం విసుగు, చిరాకు, తొందరపాటు నన్ను శాసించకుండా ఉండేందుకు నిరంతరం పోరాడాలి.

ఆలోచిస్తూన్న కొద్దీ, బలహీనురాలినయి పోతున్నాను. గుండెల్లోని రక్తం అంత నీరైపోయి, కళ్ళల్లోంచి బయటికి రావడం మొదలైంది.

నా తల మీద ఎవరిదో చేయి ఆ స్పర్శలో ఏదో ఊరట, దగ్గరతనం, ఓ బలం, ఓ ఆశ్వాసన.

మోకాళ్ళల్లో దూర్చిన తలని పైకెత్తి చూసాను.

క్రింది అంతస్థులో ఉండే రాజేశ్వరమ్మ తెల్లటి, కళ్ళతో నన్నే చూస్తోంది. ఆమె పక్కనే దీక్షితులుగారు, మరియమ్మ.

"శంకర్ లేని జీవితం శూన్యం. ఆ శూన్యాన్ని పూడ్చలేము. నిజమే కానీ, నీ జీవితంలో ఒక్క శంకరే లేడు కదా, యింకా ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. వాళ్ళ బాధ్యత నీ మీద లేదా!

జీవితంలో ప్రయాణిస్తూంటే మనతోటి ప్రయాణీకులు హఠాత్తుగా నిష్క్రమిస్తూంటారు. అది మనం అంగీకరించాలి.

పెనుగాలి వీచినపుడు, చిరుమొక్కలా తల వంచి ఆ తకిడిని అధిగమించి మహావృక్షంలా ఎదగాలి." అన్నారు దీక్షితులు గారు.

"చూడమ్మా! ఇప్పుడే నీ శక్తిని చూపించాలి. నెత్తిన మోపు నెత్తుకుని సన్నటి దారిలో వెళ్ళే వాళ్ళల్లో ఉండే లాంటి ఆత్మవిశ్వాసం నీలో రావాలి.

నీ బాధని అర్థం చేసుకోగలం. మనసుకి తగిలిన గాయాలకి లోతెక్కువ.

నిజానికి ఈ బాధలన్నీ కూడా ఉరిమె మేఘాలు దూరం నుంచి నల్లగా కనిపిస్తాయి. తీరా మన నెత్తి మీదకి వచ్చేసరికి, తేలిపోయి తెల్లగా కనిపిస్తాయి.

చీకట్లో కూచుంటే కొన్ని నీడలు కూడా అతి భయంకరంగా కనిపిస్తాయి. అందుకే నీ మొహాన్ని ఎప్పుడూ వెలుగు వైపే దాచు అప్పుడు నీ నీడ కూడా నీకు కనపడదు. "మరియమ్మ నా గుండెల్లోకి బలాన్ని పంపుతోంది.

రాజేశ్వరమ్మ నా జుట్టు సవరించింది.

"విషాధ స్మృతుల్లోకి వెళ్ళిపోతూ, వికృత జీవిగా మారిపోకు అప్పుడు జీవితం కూడా వికృతంగా మారిపోయే అవకాశం ఉంది.

నీ మానసిక ధైర్యం కోసం నా విషయం చెప్తాను. ఒక్కోసారి యితరుల అనుభవాలు మనకి ధైర్యం ఇస్తాయి. పాఠాలు నేర్పుతాయి.

ఇక్కడ, మీరంతా ఉంటున్న ఈ బిల్డింగ్ కట్టి, ఫ్లాట్లుగా చేయకముందు, చుట్టూరా బోల్డు పెరడుతో ఓ చక్కటి పొదరిల్లుండేది.

ఓ రాత్రి కురిసిన కుంభవృష్టికి ఇల్లు కూలి పోయింది. ఆ శిధిశాల్లో నా వాళ్ళంతా కూరుకుపోయారు.

నేనూ, నా ఐదెళ్ళ మనవడూ మాత్రం మిగిలాం. తెల్లారుతుంటే, శిథిలాల మధ్య కూచుని నేనేడుస్తూంటే, నా పక్కనే ఉన్న మనవడు, క్షితిజ రేఖ మీద నుంచి పైకి లేస్తున్న ఎర్రటి సూర్యబింబాన్ని చూసి ఆనందబడ్డాడు.

ఇల్లు పోతే పోయింది, అందమైన సూర్యుడిని, విడిపోతున్న వేకువ పొరల్లో, సూర్యుడి వెలుగులో మమేకం అవుతున్న ప్రపంచం చూసే అదృష్టం కలిగిందన్న వాడి ఆనందం చూసాకా, ఆశావాది తత్త్వం అంటే ఏంటిటో చాలా బాగా అర్థం అయింది.

అప్పుడు ఒకటే అనిపించింది. ప్రమిద ఉంది. నూనే కూడా ఉంది.

కానీ దీపం కొడి గొడ్తోంది. ఇప్పుడు చేయాల్సిందల్లా ఉన్న వత్తిని పైకి తోయడం మాత్రమే. అప్పుడా దీపం, అప్పుడే వెలిగించినంత సంతోషంగా వెలుగుతుంది.

నువ్వు చెయ్యాల్సింది కూడా యిదే. ఈ రోజు నాది, నా పిల్లలది అని అనుకున్న రోజున జీవితం సంతృప్తిగా ఉంటుంది. ఏమో రేపటి రోజు ఆలస్యం కావచ్చు.

పూర్తి స్పృహతో, సంపూర్ణత నిండిన హృదయంతో పరిస్థితిని చూడు. అప్పుడు మామూలుగా అయిపోతావు అన్నారు.

అందరి మాటలు వింటూండి పోయాను.

యింతలో గుమ్మం దగ్గర అలికిడి అయింది.

అందరం అటువైపు చూసాం. ఓ అరడజను మంది యువకులు వాళ్ళంతా ఈ బిల్డింగ్‌లోనే ఉంటున్నారు.

ఇది వరకూ నాకు వాళ్ళని చూసే అవకాశం రాలేదు. చూడలేదు. కానీ, శంకర్ పోయాకా, వాళ్ళందరూ నా గురించి, పిల్లల గురించి మా కష్టసుఖాలు బాగోగులు అడిగి తెలుసుకుంటూ చాలా దగ్గరయ్యాయి.

మనుషులు దగ్గరవుతున్న కొద్ది సహకార ధోరణి బాగా పెరిగిపోయింది.

వాళ్ళల్లో సక్సేనా అనే పిల్లాడు ముందుకొచ్చాడు.

"శంకర్‌గారు పోయాకా, మేమందర కూడా నీ గురించి నీ ఇద్దరి పిల్లల గురించి చాలా ఆలోచించాం నీకు ఏదో దారి చూపించాలని అనుకున్నాం.

నీ కున్న చదువుతో ఎలాంటి ఉద్యోగం వస్తుందో ఎంత జీతం వస్తుందో కూడా ఊహించాము. ఆ జీతంతో రోజులు గడవడం చాలా కష్టం......" ఆగాడు.

పక్క ఇంట్లో ఉండే వంశీ అందుకున్నాడు.

"మేమంతా బహుళ జాతీయ సంస్థల్లో పని చేస్తున్నాం. ఉద్యోగరిత్యా మా వాళ్ళని వదిలి ఉంటున్నాం లోకం నిద్రపోతున్న సమయంలో మా విధులు, పనులు మొదలవుతాయి. మా జీతాలు ఎక్కువే కానీ, చక్కటి యింటి భోజనం

తినే అదృష్టం మాకు లేదు."

ఏం చెప్తున్నారో కొంచెం కొంచెంగా అర్థం అవుతోంది. జీవితం మీద నిన్నటి వరకూ లేని ఉత్సాహం మెల్లగా ప్రవేశిస్తోంది.

"నీకర్థం అయిందనుకుంటాను. మా భోజన బాధ్యత నీవు తీసుకోవాలి." అన్నారు దీక్షితులు గారు.

కళ్ళు విప్పార్చుకుని చూడడం మినహా నేనేం అనలేకపోయాను.

"వంట చేసి డబ్బు సంపాదించడమా అని ఆలోచించకు. ఒకరిని మోసగిస్తే సిగ్గుపడాలి. ఒకరిని దోచుకుంటే సిగ్గుపడాలి.

రెండు భుజాల మధ్య ఉన్న తలని నిటారుగా ఉంచే పని చేస్తూ బతుకు సాగిస్తే సిగ్గు పడక్కర్లేదు." అన్నారు దీక్షితులుగారు ఆలోచనలో పడ్డాను.

వాళ్ళకి నేనెవరో తెలీక వజ్రపు ముక్కల్లాంటి సలహాలిస్తున్నారు. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు.

నాది శంకర్‌ది మతాంతర వివాహం ఈ సంగతి వీరికి తెలియ చేయాలి.

వాళ్ళని చూసి చేతులు జోడించాను.

"నేను చాలా అదృష్టవంతురాలిని. కన్నవాళ్ళ కన్నా ఎక్కువగా నా బాధల్ని, నా కష్టాన్ని పంచుకుని నన్ను మనిషిని చేసారు. కానీ, నేనెవరో మీకు తెలియాలి. నా మతం, నా పుట్టుక, నా మతంతర వివాహం." మరియమ్మ అందుకుంది.

"అక్కర్లేదమ్మా నీ విషయాలు మాకు తెలియాల్సిన అవసరం లేదు.

మా అందరికీ తెలిసినదల్లా, నువ్వు ఓ సాటి మనిషివి. జీవితంలోని నాలుగు రోడ్ల కూడలిలో, ఇద్దరి పిల్లలతో, దిక్కు తోచని స్థితిలో దీనంగా నిస్సహాయంగా ఉన్న స్త్రీవి అంతే......."

జవం జీవంనానర నరాల్లో పాకడం మొదలైంది.

"అవును తల్లీ – అంతే. ఈ నిస్సహాయితే మనల్ని దగ్గర చేసింది.

ఆకలేస్తుంటే కులం అడ్డురాదు. అన్నం వడ్డించే గరిటకి మతం అంటే ఏంవిటో తెలీనక్కర్లేదు.

మన శరీరాల పైనున్న చర్మం ఒకటే. మన శరీరాల్లో ప్రవహించేది ఒకటే . అంటే మనమంతా ఒకటి జాతి వాళ్ళం. అది మానవజాతి మానవ జాతికి కులం, మతం, రంగు ఉండదు. మానవత్వం మాత్రం ఉంటుంది.

సాటి మనిషికి సాయం చేస్తున్నాం అన్న సంతృప్తి మాలోనూ నీలోను ఉండిపోనీ..." అన్నారు రాజేశ్వరమ్మగారు.

నాకింక వేరే ఆలోచన రాలేదు. ఆలోచించలేదు. "మీధర్మం వేరు - నా ధర్మం వేరు...." ఆఖరికి సంశయిస్తూ అన్నాను.

"ఎవరి ధర్మాలు వారివే. ధర్మం అనేది మనుషుల్ని కలిపేదిగా ఉండాలి. కానీ, విడదీసేదిగా ఉండకూడదు."

'అలాగే' అన్నాను. ఇది గుండెల్లోంచి వచ్చింది.

ఆకలి, దరిద్రం, మా దరిదాపుల్లోకి రాకుండా ఉండాలంటే వాళ్ళు చెప్పినట్లు చేయాలి.

ఆ తర్వాత ఆ భవనంలో వంట చేసుకోలేని స్థితిలో ఉన్న ముసలాళ్ళకి, బ్రహ్మచారులకి, ఉద్యోగస్తులకి గరిట పట్టుకున్న కాశీ అన్నపూర్ణనయి పోయాను.

నా అసలు పేరు వెనక్కి వెళ్ళింది. అందరికీ అన్నపూర్ణ. అదే సార్థకం అయిపోయింది.

నా అసలు పేరు ఏంవిటో అన్న సంగతి నేను కూడ మర్చిపోయాను. అది గుర్తు చేసుకోడానికి ప్రయత్నించలేదు.

ఆ మనవత్వపు మనుషుల నీడలో ఆ అవసరం రాలేదు.

(ఆకాశవాణి నవంబరు 19, 2007 నషనల్ ఇంటిగ్రేషన్ డే సందర్భంగా)